ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 300 | పేజీలు: 4 | వెల: రూ.3/- | గురువారం 6 ఫిబ్రవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## అక్రమ వలసదారులపై
# అమెరికా ఉక్కుపాదం




**అమృత్‌సర్‌లో దిగిన అమెరికా ప్రత్యేక విమానం**

**అక్రమంగా ఉంటున్నారన్న కారణంగా 205మంది రాక**

**ట్రంప్ ఆదేశాలతో సైనిక విమానంలో తరలింపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** చట్ట వ్యతిరేకంగా అగ్రరాజ్యంలో అడుగుపెట్టిన వారిని ప్రత్యేక విమానంలో స్వదేశానికి పంపింది. 205 మందితో టెక్సాస్ నుంచి బయల్దేరిన అమెరికా సైనిక విమానం సీ-17.. బుధవారం మధ్యాహ్నం పంజాబ్‌లోని అమృత్‌సర్ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో దిగింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపిన అమెరికా ప్రభుత్వం.. కొంతమంది భారతీయులను కూడా వెనక్కి పంపిన సంగతి తెలిసిందే. వీరంతా పంజాబ్, దాని చుట్టుపక్కల రాష్ట్రాలకు చెందినవారిగా తెలుస్తోంది. అయితే, వీరిని అదుపులోకి తీసుకునేందుకు స్వదేశంలో ఎలాంటి ఆదేశాలు లేవని సమాచారం. అవసరమైన తనిఖీల అనంతరం ఎయిర్‌పోర్టు నుంచి బయటకు పంపించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. వెనక్కి పంపేముందు ప్రతిఒక్కరి రికార్డులను పరిశీలించినట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించారు. రానున్న రోజుల్లో మరిన్ని విమానాలు అమెరికా నుంచి భారత్‌కు రానున్నాయని వివరించారు. అమెరికా హోంలాండ్ అధికారుల లెక్కల ప్రకారం.. 20,407 మంది భారతీయుల వద్ద సరైన పత్రాలు లేనట్లు గుర్తించిన అధికారులు.. 17,940 మందిని వెనక్కి పంపేందుకు తుది ఉత్తర్వులు జారీ చేశారు. 2,467 మంది ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ రిమూవల్ ఆపరేషన్స్ నిర్బంధంలో ఉన్నారు. తొలివిడతలో భాగంగా 205 మందిని వెనక్కి పంపించారు. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటి నుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ క్రమంలోనే ఎల్ పాసో, టెక్సాస్, శాన్ డియాగో, కాలిఫోర్నియాలో ఉన్న 5,000 మంది అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు పెంటగాన్ సిద్ధమైంది. ఇప్పటికే కొంతమందిని సైనిక విమానాల్లో గటేమాలా, పెరు, హోండూరస్ తదితర దేశాలకు తరలించింది. అక్రమ వలసదారులపై అమెరికా ..మిగతా 2లో





## ముగిసిన ఢిల్లీ
# అసెంబ్లీ పోలింగ్

**8న ఓట్ల లెక్కింపును చేపట్టనున్న ఇసి**

**మూడు ఆప్ నియోజకవర్గాలపైనే అందరి దృష్టి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. 8న ఓట్ల లెక్కింపు జరుగనుంది. బిజెపి, ఆప్ హోరాహోరీగా ప్రచారం నిర్వహించి పోరాడాయి. ప్రస్తుతం ఢిల్లీలో ఏపార్టీకి మెజార్టీ వస్తుందనే సంగతి పక్కనపెడితే.. అందరి దృష్టి మూడేమూడు నియోజకవర్గాలపై ఉంది. ఈ మూడు నియోజకవర్గాల్లో ఎవరు గెలుస్తారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఈ మూడు నియోజవర్గాల్లో అధికార ఆప్‌కు చెందిన ముగ్గురు కీలక నేతలు పోటీచేయడంతో ఈ నియోజకవర్గాలపై ఆసక్తి నెలకొంది. మాజీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజీవ్రాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి అతిషి, మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా పోటీ చేస్తున్న నియోజకవర్గాల్లో ఫలితం ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ కొనసాగు తోంది. అరవింద్ కేజీవ్రాల్, అతిషి ఈజీగా గెలుస్తారని కొందరు రాజకీయ పండితులు అంచనా వేస్తుండగా ఈ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ గెలిచే అవకాశాలు ఉన్నాయని చెప్పేవాళ్లు లేకపోలేదు. దీంతో ఈ మూడు నియోజకవర్గాల ఓటర్లు ఎలాంటి తీర్పునిచ్చారనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. ఆప్ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ స్వయంగా న్యూఢిల్లీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. గత మూడు ఎన్నికల్లో వరుసగా ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుస్తూ వస్తున్న ..మిగతా 2లో

# కుంభస్నానం దైవానుగ్రహం



**త్రివేణీ సంగమ స్నానంపై మోడీ**

ప్రయాగరాజ్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం): ప్రధాని నరేంద్ర మోడీ బుధవారం ప్రయాగ్ రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద పుణ్య స్నానం ఆచరించారు. 'మహా కుంభమేళాకు హాజరు కావడం దైవానుగ్రహమే' అని భావిస్తున్నానని ఆయన తెలిపారు. 'భక్తితో ధ్యానంలో ..మిగతా 2లో

# గొంగడి త్రిషకు సిఎం అభినందనలు



**కోటి రూపాయాల నజరానా ప్రకటన**

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** క్రికెటర్ గొంగడి త్రిషన్ సిఎం రేవంత్ రెడ్డి అభినందించారు. అలాగే ఆమెకు కోటి రూపాయాల నజరానా ప్రకటించారు. తెలంగాణలో క్రీడాకారులకు అండగా ప్రభుత్వం ఉంటుందని అన్నారు. వారికి అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్‌లో రాణించిన క్రికెటర్ గొంగడి త్రిష బుధవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా త్రిషను అభినందించి, శాలువాతో సీఎం సత్కరించారు. ఆమెకు రూ.కోటి నజరానా ప్రకటించారు. భవిష్యత్తులో దేశం తరపున మరింతగా రాణించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## టిటిడిలో హిందూయేతర
## ఉద్యోగుల
# తొలగింపు

**18 మందిపై చర్యలకు ఛైర్మన్ ఆదేశాలు**



**తిరుమల, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** హిందూయేతర ఉద్యోగులు, సిబ్బందిపై తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో ఉన్నప్పుడు హిందూయేతర మత ఆచారాలు పాటించిన వారిపై చర్యలకు తితిదే సిద్ధమైంది. 1989 ఎండోమెంట్ యాక్ట్ 1060 మేరకు హిందూమత సంప్రదాయాలను అనుసరిస్తామని ప్రమాణం చేసి తితిదేలో ఉద్యోగం పొందిన కొందరు అన్యమతాలను అనుసరిస్తున్నట్లు గుర్తించారు. 18 మందిపై క్రమశిక్షణ చర్యలకు తితిదే ఆదేశాలు జారీ చేసింది. హిందూయేతర ఉద్యోగులను ఇతర విభాగాలకు బదిలీ చేయాలని నిర్ణయం తీసుకుంది. వీఆర్ఎస్ తీసుకునే వారికి అనుమతి ఇవ్వాలని నిర్ణయించింది. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు సూచనలతో ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. గతేడాది నవంబరు 18న తితిదే బోర్డు సమావేశంలో చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగు నీటి
# అవసరాలు తీర్చండి

**నారాయణపూర్ ప్రాజెక్ట్ నుంచి జారాలకు నీటి విడుదల చేయండి**

**కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్‌కు**

**మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్ బాబు విజ్ఞప్తి**

**మంత్రుల వెంట ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్**

**నీటి ఇబ్బందులను వివరించిన మంత్రుల బృందం**

**నీటి విడుదలకు సానుకూలంగా స్పందించిన డీకే**

**నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి 4 టీఎంసీల నీటిని విడుదల చేస్తామని హామీనిచ్చిన డీకే**

బెంగళూర్, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం) కర్నాటకలోని నారాయణపూర్ డ్యాం నుంచి 5 టీఎంసీల నీటిని విడుదల చేసి ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగునీటి అవసరాలు తీర్చాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దారామయ్యను పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోరారు. సీయం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, వాకిటి శ్రీహరి, గవినోళ్ల మధుసూదన్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ ..మిగతా 2లో



కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు వినతి పత్రం అందజేస్తున్న జూపల్లి కృష్ణారావు, ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు



# ఎల్బీనగర్‌లో ప్రమాదం

**సెల్లార్ తవ్వుతుండగా పైనుంచి పడ్డ మట్టిదిబ్బలు**

**అక్కడికక్కడే ముగ్గురి మృతి...**

**మృతులంతా బిహార్ వాసులుగా గుర్తింపు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** నగరంలోని ఎల్బీనగర్‌లో సెల్లార్ తవ్వకాల్లో అపశృతి చోటు చేసుకుంది. సెల్లార్ లోపల పనిచేస్తుండగా పైనుంచి మట్టిదిబ్బలు కుప్పకూలాయి. ఈ క్రమంలో మట్టిదిబ్బలు పడటంతో ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే మృతి చెందారు. ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మట్టిదిబ్బల కింద నుంచి మూడు మృతదేహాన్ని బయటకు తీశారు. అయితే రెండు గంటల పాటు శ్రమించిన తర్వాత అతికష్టం మీద మూడు మృతదేహాలను వెలికితీశారు. మృతి చెందిన ముగ్గురు బీహార్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు వీరయ్య, వాసు, రాములుగా తెలుస్తోంది. ముగ్గురి ..మిగతా 2లో



జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లబ్ధిదారులు

## లబ్ధిదారులకు వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇళ్లను పంపిణీ చేయాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం)లాటరీ పద్ధతిలో ఎంపికైన ప్రతి లబ్ధిదారునికి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గద్వాల జిల్లా కేంద్రంలోని సంఘాల చెరువు వద్ద 1,275 , గోన్ పాడు గ్రామం దగ్గర 25 ఇళ్ళను ఇల్లు లేని పేదల కోసం, ఇళ్ల స్థలాలు కోల్పోయిన పేదలకు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసి సంవత్సరం పూర్తయిన ఇప్పటివరకు లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేయకపోగా మళ్లీ దాదాపు 99 మందిని డబల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలోంచి తొలగిస్తున్నట్లుగా వార్తలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అధికార యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ వార్డు స్థాయిలో పకడ్బందీగా సర్వే చేసి లక్కీ డిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసినప్పుడు తప్పు ఎలా దొర్లుతుందని ప్రశ్నించారు. గతంలో కొంతమంది మధ్య దళారులు ఇందిరమ్మ ఇళ్లను పేద ప్రజల పేరుతో కాజేసారని,వారు చేసిన పాపాలకు పేద ప్రజలను బలి చేయడం ఏ విధంగా సమంజసకరం అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న రెండు పడక గదుల ఇళ్లలో మంచినీరు విద్యుత్తు మరుగుదొడ్లు లాంటి మౌలిక సదుపాయాలు వెంటనే పూర్తి చేసి వేగంగా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియ పూర్తి చేయాలని, గతంలో లబ్ధి పొందిన వారీతో సంబంధం లేకుండా లాటరీ పద్ధతిలో ఎంపికైన ప్రతి లబ్ధిదారునికి వెంటనే డబల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేయాలని లేని పక్షంలో లబ్ధిదారులను కలుపుకొని ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ రెండు పడక గదుల లబ్ధిదారులు రాముడు, షేక్ సాదిక్, గంజిపేట ఆంజనేయులు, లక్ష్మి, జమున, అబ్బులమ్మ, నాగరాజు, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



## నూతన క్యాలెండర్ ఆవిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ బి.ఎన్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం)జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్ ను బుధవారం జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలోజిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు రహీముద్దీన్, ప్రధాన కార్యదర్శి శశిధర్ రెడ్డి ,కోశాధికారి వెంకట్ రెడ్డి,మహిళా వైస్ ప్రెసిడెంట్ రాజేశ్వరి , జాయింట్ సెక్రటరీ మహమ్మద్ కలీం, డాక్టర్ యామిని సాయి ,ఆర్గనైజింగ్ సెక్రెటరీ కరుణాకర్ రెడ్డి, కల్చరల్ సెక్రెటరీ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పీజీ సెంటర్‌లో ఘనంగా స్వాగత వేడుకలు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం)గద్వా పట్టణ పరిధిలోని నదీ అగ్రహారం వద్ద ఉన్న ప్రభుత్వ పీజీ సెంటర్ లో బుధవారం నూతన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు ఆహ్వానం పలికి స్వాగత వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ తర్వాత సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జూనియర్స్ మరియు సీనియర్స్ సఖ్యతను పాటించి చదువుతో తల్లిదండ్రులకు, అధ్యాపకులకు, చదువుకున్న కళాశాలకు పేరుప్రతిష్టలు తీసుకరావాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు బండరపల్లి అరవింద్, డాక్టర్ మంగళగిరి శ్రీనివాసులు, డాక్టర్ గోపినాథ్ రాథోడ్, డాక్టర్ మహేందర్, వి. గణేష్, డాక్టర్ రావిశేరిన్, రంగారెడ్డి, ఆంజనేయులు, గట్టయ్య, లక్ష్మయ్య, డాక్టర్ వేణుగోపాల్ , శివశంకర్, నమ్రత, శ్రీనివాసులు అధ్యాపకేతర బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కుంభస్నానం దైవానుగ్రహం

మొదటి పేజీ తరువాయి...

నిమగ్నమైనట్లు' ఆయన చెప్పారు. ప్రధాని మోడీ పుణ్య స్నానం ఆచరిస్తున్నప్పుడు చేతిలో రుద్రాక్షమాల పట్టుకున్నారు. ముదురు కాషాయ రంగు జెర్సీ ధరించిన మోడీ మంత్రోచ్చాటన చేస్తూ సూర్యునికి, గంగకు ప్రార్ధనలు చేశారు. 'ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో పాల్గొనడం దైవానుగ్రహమే. త్రివేణి సంగమం వద్ద కోట్లాది మందిఇతర భక్తుల వలె పుణ్య స్నానం ఆచరించాను. 'భక్తితో ధ్యానంలో నిమగ్నమయ్యాను' అని మోడీ 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు. 'గంగా మాత శాంతి, విజ్ఞత, మంచి ఆరోగ్యం, సమరస భావంతో అందరినీ ఆశీర్వదించుగాక' అని మోడీ అన్నారు.ప్రధాని మోడీ త్రివేణి సంగమం వద్దకు అరైల్ ఘాట్ నుంచి ఒక పడవలో చేరుకున్నారు. ఆయన వెంట ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఉన్నారు. మోడీ ఆ ప్రదేశానికి చేరుకునేటప్పుడు నదికి రెండు వైపుల బారులు తీరిన జనసమూహం చేతులు ఊపుతుండగా ఆయన ప్రత్యభివాదం చేశారు. పవిత్ర స్నానం ఆచరించిన తరువాత ప్రధాని మోడీ నదిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఒక వేదికపైకి ఎక్కి హారతి సహా పూజాదికాలు నిర్వహించారు. ఆయన పవిత్ర నదులకు పాలు, పూలు సమర్పించారు. ఆయన త్రివేణి సంగమం వద్ద ఒక చీర కూడా సమర్పించారు. ఒక అర్చకుని మార్గదర్శకంలో ప్రధాని మోడీ ఆ పక్రియలు నిర్వర్తించారు. కాగా, ప్రధాని పర్యటన కోసం భద్రతను కట్టుదిట్టం చేశారు. ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు, ఉత్తర ప్రదేశ్ మిల్కీపూర్‌లో ఉప ఎన్నిక జరుగుతున్న రోజు ఆయన పర్యటన చోటు చేసుకున్నది.

# నేరస్థుల్లా సంకెళ్లు వేసి పంపడం అవమానం

### ఇది భారతదేశ ప్రతిష్టకు భంగకరం.. భారతీయులను వెనక్కి పంపించడంపై కాంగ్రెస్ విమర్శలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం):** అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న భారతీయులను అమెరికా ప్రత్యేక విమానాల్లో భారత్‌కు తరలిస్తున్నవిషయంపై ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. అక్కడి భారతీయుల చేతికి సంకెళ్లు వేసి..వారిని నేరస్థులుగా పంపడం అవమానకరమని పేర్కొంది. ఓ భారతీయుడిగా అలాంటి దృశ్యాలు చూడలేకపోతున్నానని కాంగ్రెస్ నేత పవర్ ఖేడా ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో భారత దౌత్యవేత్త దేవయాని ఖోబ్రగాడేకు అమెరికాలో ఎదురైన అవమానాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. 2013లో న్యూయార్క్‌లో దౌత్య కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఓ వీసా వ్యవహారంలో ఆమెను అక్కడి పోలీసులు అరెస్ట్ చేసి..అవమానించిన విషయం తనకు జ్ఞాపకానికి వస్తోందని అన్నారు. ఆ విధంగా ప్రవర్తించినందుకు అదే సమయంలో దేశంలో పర్యటించిన అమెరికా కాంగ్రెస్ ప్రతినిధి బృందాన్ని కలవడానికి అప్పటి యూపీఏ ప్రభుత్వ నేతలు నిరాకరించారని అన్నారు. యూఎస్ ఎంబసీకి ఇచ్చిన అనేక ప్రోత్సాహకాలను భారత్ ఉపసంహరించుకుందని పేర్కొన్నారు.కాగా అమెరికా నుంచి అక్రమ భారతీయ వలసదారులను తీసుకువస్తున్న ఈ విమానం మొదటిది కాదని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. వాస్తవాలు బయటకు రాకుండా భాజపా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. జో బైడెన్ అధికారంలో ఉన్న సమయంలో కూడా 1100 మంది భారత అక్రమ వలసదారులను అమెరికా నుంచి బహిష్కరించారని..కానీ వారి వివరాలు వెల్లడించలేదని పేర్కొన్నారు. 2022 నాటికి యూఎస్‌లో 725,000 మంది భారతీయ అక్రమ వలసదారులు ఉన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయని చెప్పారు. అక్రమవలసదారులపై మొదటి నుంచి కఠినంగా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్కడ అక్రమంగా ఉంటున్న విదేశీ వలసదారులను స్వదేశాలకు పంపుతున్నారు.



## అక్రమ వలసదారులపై అమెరికా ఉక్కుపాదం

మొదటి పేజీ తరువాయి...

అనుసరిస్తున్న విధానాల పట్ల ఇప్పటికే భారత్ తన స్పందనను తెలిపింది. అక్రమ వలసలకు తాము వ్యతిరేకమని, ఈ అంశం అనేక రకాల వ్యవస్థీకృత నేరాలతో ముడిపడి ఉందని పేర్కొంది. వీసా గడువు ముగిసినా లేదా సరైన దస్త్రాలు లేకుండా భారతీయులు అమెరికాతో సహా ఎక్కడ ఉన్నా వారిని తిరిగి తీసుకువచ్చేందుకు వీలు కల్పిస్తామని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది.



కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

### ఉమ్మడి పాలమూరు జిల్లా సాగు, తాగు నీటి

# అవసరాలు తీర్చండి

మొదటి పేజీ తరువాయి...

మంగళవారం బెంగళూర్ లో సీయం సిద్దారామయ్యను కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం నీటి పారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్ ను కలిసి .. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు. ఉమ్మడి పాలమూరు జిల్లా వరప్రదాయని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వేగంగా అడుగంటుతోందని, రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గిపోయి నీటిమట్టం పడిపోతోందని వారికి వివరించారు. ఉమ్మడి పాలమూరు జిల్లా రైతులు, ప్రజలకు సాగు,తాగునీరు అందించే జూరాల ప్రాజెక్టులో నీటిమట్టం నిరాశాజనకంగా ఉందని,ప్రస్తుత పరిస్థితుల్లో, ఈ ప్రాంతం తీవ్రంగా సాగు, తాగునీటి కొరతను ఎదుర్కొంటోందని, దీంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో ఫిబ్రవరి 4, 2025 నాటికి నీటి నిల్వ తీవ్రంగా తగ్గిపోయి కేవలం 1.7 టీఎంసీకి చేరిందని, పరిస్థితి ఇలాగే సాగితే నీటిమట్టం డెడ్ స్టోరేజీకి పడిపోతుందనే ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తాగునీటి సరఫరా, పంటలకు అవసరమైన సాగునీటి అవసరాలపై తీవ్రమైన ఒత్తిడి ఏర్పడిందని, పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొని ఉందని, లక్షలాది మంది రైతుల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని నీటి సంక్షోభంపై వారికి వివరించారు.

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు వరప్రదాయిని అని, జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, భీమా ప్రాజెక్ట్ వంటి ప్రధాన ప్రాజెక్టులకు నీటిని అందిస్తూ సాగు, తాగునీటి అవసరాలను తీరుస్తుందని తెలిపారు. ఈ మూడు ప్రాజెక్టుల ద్వారా సుమారు 2.5 లక్షల ఎకరాల వ్యవసాయ భూమికి నీరు అందుతోందని, ప్రస్తుతం పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, నీటి నిల్వల తగ్గుదల కారణంగా ప్రస్తుత పంటలకు కనీసం రెండు తడులు ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.అంతేకాక, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 30 లక్షల మంది ప్రజలు తాగునీటి కోసం పూర్తిగా ఈ నీటి వనరుపైనే ఆధారపడి ఉన్నారని, నీటి నిల్వలు తగ్గుతుండటంతో గద్వాల్, వనపర్తి, కొల్లాపూర్, దేవరకద్ర, మక్తల్ నియోజకవర్గాల్లో తీవ్ర నీటి సంక్షోభం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు ఈ ప్రాంతానికి తక్షణమే నీటి విడుదల జరగకపోతే, పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారని, అదేవిధంగా తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చి ప్రజల దాహార్తిని తీర్చడం కష్టంగా మారనుందని వివరించారు.

ఇలాంటి పరిస్థితుల నుంచి గట్టెక్కించేందుకు చర్యలు తీసుకోవాలని, నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తక్షణమే 5 టీఎంసీల నీటిని విడుదల చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు, డిప్యూటీ సీయంకు మంత్రి జూపల్లి విజ్ఞప్తి చేశారు. నీటిని విడుదల చేయడం వల్ల తాగునీటి కష్టాలు తీరుతాయని, యాసంగి పంటలకు కూడా ఢోకా ఉండదని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీకే శివకుమార్.. 4 టీఎంసీల నీటి విడుదల చేస్తామని భరోసానిచ్చినట్లు మంత్రుల బృందం తెలిపింది.



నడిగడ్డ ప్రజల ఆరాధ్య దైవం జములమ్మ అమ్మవారికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి సతీమణి జ్యోతి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న బండ్ల జ్యోతి

## పుట్టింటి నుంచి మెట్టినింటికి చేరిన అమ్మవారు

### ఊరూరా హారతులు పట్టిన భక్తులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం)నడిగడ్డ ఇలవేల్పు శ్రీజమ్ములమ్మ అమ్మవారు బుధవారం పుట్టినింటి నుంచి మెట్టి నింటికి చేరుకుంది. తన తల్లి గారి గ్రామమైన గుర్రంగడ్డ నుంచి బుధవారం జమ్మిచేడులోని మెట్టినింటికి వచ్చింది. జమ్ములమ్మ అమ్మవారిని తీసుకురా వడానికి మంగళ వారం సారెతో ఎద్దుల బండి వెళ్లగా, సా యంత్రానికి గుర్రం గడ్డకు చేరుకుంది. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, జములమ్మను కృష్ణాన దిలో బోటు ద్వారా ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడ ఎద్దుల బండిపైన అమ్మవారిని కూర్చోబెట్టి బీరోలు, లత్తీపురం, వెంకటోనిపల్లి మీదుగా జమ్మిచేడుకు చేర్చారు. అక్కడ అమ్మ వారికి ఆలయ చైర్మన్ వెంకట్రాములు, ఆలయ ఈఓ పురేందర్ ఆధ్వర్యంలోఎద్దులబండి మీద తీసుక వచ్చిన అమ్మవారికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి ప్రత్యేక పూజలు చేశారు. అక్కడి నుంచి అమ్మవారిని శ్రీజమ్ములమ్మ ఆలయానికి తీసుకవచ్చారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



## ముగిసిన ఢిల్లీ అసెంబ్లీ పోలింగ్

మొదటి పేజీ తరువాయి...

కేజ్రీవాల్ నాల్గవసారి తన అదృష్టాన్ని పరీక్షించుకుంటు న్నారు. 2020లో 21వేల687 ఓట్ల మెజార్టీతో గెలిచిన కేజ్రీవాల్ ఈ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ నుంచి గట్టిపోటీ ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఢిల్లీ మాజీ సీఎం షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేస్తుండగా.. బీజేపీ నుంచి పర్వేష్ సింగ్ వర్మ పోటీచేస్తున్నారు. కాంగ్రెస్ నుంచి బలమైన అభ్యర్థి పోటీలో ఉండటంతో ఓట్లు చీలి బీజేపీ అభ్యర్థి గెలుస్తారనే అభిప్రాయాన్ని రాజకీయ విశ్లేషకులు కొందరు వ్యక్తం చేస్తున్నారు. విజయంపై ధీమాగా ఉన్నప్పటికీ అరవింద్ కేజ్రీవాల్‌ను మరోవైపు ఓటమి భయం వెంటాడుతుందనే ప్రచారం జరుగుతోంది. కేజ్రీవాల్ ఓడిపోతే మాత్రం రాజకీయంగా ఆయనకు గట్టి ఎదురుదెబ్బగా భావించాల్సి ఉంటుంది. ఢిల్లీ సీఎం అతిషి కల్కాజీ నియోజకవర్గం నుంచి పోటీచేస్తున్నారు. ఆమె ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఎదుర్కొన్నారు. కాంగ్రెస్ బలమైన అభ్యర్థిని నిలబెట్టడంతో ఆమెకు కొంత ఇబ్బంది ఏర్పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అల్కలంబ కాంగ్రెస్ నుంచి, రమేష్ బిదురి బీజేపీ నుంచి పోటీచేస్తున్నారు. రమేష్ బిదురి బీజేపీ నుంచి గతంలో ఎంపీగా పనిచేశారు. ముగ్గురు బలమైన అభ్యర్థులు కావడంతో ఈ నియోజకవర్గంలో గెలుపు ఎవరిని వరిస్తుందనేది ఉత్కంఠ రేపుతోంది. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి, ఆప్ కీలక నేత మనీష్ సిసోడియా ఈసారి తన నియోజకవర్గాన్ని మార్చుకున్నారు. ప్రతాప్‌గంజ్ నుంచి గత ఎన్నికల్లో పోటీచేసిన సిసోడియా ఈసారి జంగ్‌పుర నుంచి బరిలో దిగారు. 2015, 2020 ఎన్నికల్లో ఆప్ నేత ప్రవీణ్ కుమార్ ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ప్రస్తుతం సిసోడియా పోటీ చేయగా.. ఆయనపై తర్‌విందర్ సింగ్‌ను బీజేపీ పోటీకి పెట్టగా.. కాంగ్రెస్ పర్వాద్ సూరీని పోటీకి దింపింది.

## ఎల్బీనగర్‌లో ప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా సెల్లార్‌లో మట్టి దిబ్బలు కూలి పెద్ద శబ్ధం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతుల్లో ఇద్దరు తండ్రీ, కొడుకులు ఉన్నట్లు గుర్తించారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో పనిచేసే ప్రాంతంలో విషాద ఛాయలు అలముకున్నాయి. అయితే సెల్లార్ తవ్వకాలు జరుపుతున్న సమయంలో జీహెచ్‌ఎంసీ నిబంధనల ప్రకారం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే సెల్లార్ తవ్వే క్రమంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఈ అపార్ట్‌మెంట్ నిర్మాణం జరుగుతున్న క్రమంలో పెద్ద ఎత్తున సెల్లార్ కోసం తవ్వకాలు చేపట్టారు. రాత్రి సమయంలో పెద్ద ఎత్తున పేలుళ్లు జరుపుతున్నట్లు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ విషయాన్ని జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ వారు పట్టించుకోని పరిస్థితి. ఈ సెల్లార్లన్నీ కూడా 40 అడుగుల లోతులో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంత పెద్దఎత్తున సెల్లార్ల తవ్వకం చేస్తున్నప్పటికీ కూడా జీహెచ్‌ఎంసీ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారని.. జీహెచ్‌ఎంసీ అధికారులు పర్మిషన్లు ఇవ్వడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

# సమిష్టి కృషితో వ్యవసాయ విశ్వవిద్యాలయ ర్యాంకు, స్థాయి పెంపొందించాలి

### ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

బుద్వేల్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం): పూర్తి ప్రతిభ, సమర్థత, అనుభవాల ఆధారంగా విశ్వవిద్యాలయ అధికారుల నియామకం జరిపినట్లు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అధికారుల నియామకం విషయంలో తనకు పూర్తి స్వేచ్ఛనిచ్చారని ఎటువంటి ఒత్తిళ్లు, ప్రభావాలు లేకుండా నియామకాలు పూర్తి చేసినట్లు వివరించారు. ఇటీవల నియమితులైన విశ్వవిద్యాలయ అధికారులు, ఇతర ఉన్నత అధికారుల పరిచయ కార్యక్రమం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో బుధవారం జరిగింది. ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య వీరందరినీ సమావేశానికి హాజరైన బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులకు పరిచయం చేశారు. అనేక ఏళ్ల తర్వాత పూర్తిస్థాయి విశ్వవిద్యాలయ అధికారులని నియమింప చేసే అవకాశం తనకు లభించిందన్నారు. ఈ కొత్త బృందం "మంచి భవిష్యత్తుకి కొత్త ఆశలు" కల్పిస్తుందని జానయ్య అన్నారు. కొన్ని విభాగాల్ని పునర్వ్యవస్థీకరించడం ద్వారా విశ్వవిద్యాలయాన్ని మరింత ప్రగతి పథంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. రానున్న ఏళ్ళల్లో దేశంలో 10 అత్యుత్తమ వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం స్థానం సాధించడానికి అందరము కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. బోధన, బోధనేతర సిబ్బంది నిరంతర శిక్షణ, అధ్యయనం, సానుకూల దృక్పథంతో, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తే ఆ లక్ష్యాన్ని సాధించడం సాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. అంతిమంగా రైతాంగ సంక్షేమం పరమావధిగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని ఆల్దాస్ జానయ్య పిలుపునిచ్చారు. ఉపకులపతి సూచనలు, సలహాలతో విశ్వవిద్యాలయ స్థాయిని మరింత పెంచేందుకు కృషి చేస్తానని రిజిస్ట్రార్ జీయి సీ హెచ్ విద్యాసాగర్ స్పష్టం చేశారు. నిజాయితీ, చిత్తశుద్ధితో ఇన్నేళ్లు బాధ్యతలు నిర్వర్తించడం వల్లనే నేడు తనకీ అవకాశం వచ్చిందని భావిస్తున్నానని ఆయనన్నారు. ఈ సందర్భంగా తమ అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలు గురించి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె ఝాన్సీ రాణి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎం బలరాం, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్టెన్షన్ డాక్టర్ ఎం యాకాద్రి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ కె బి ఈశ్వరి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సీ హెచ్ వేణుగోపాల్ రెడ్డి, సెంటర్ ఆఫ్ డిజిటల్ అగ్రికల్చరల్ డైరెక్టర్ డాక్టర్ బి .బాలాజీ నాయక్, ప్లానింగ్ అండ్ మానిటరింగ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ జె .శశికళ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం .మల్లారెడ్డి, డైరెక్టర్, సెంటర్ ఫర్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్మెంట్ డాక్టర్ కె. సురేష్, డైరెక్టర్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డాక్టర్ వి . రాములు, డైరెక్టర్, సెంటర్ ఫర్ నేచురల్ రిసోర్స్ అండ్ ఎన్విరాన్మెంట్ డాక్టర్ కె పి వాణి, డైరెక్టర్, అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ డాక్టర్ జి .శ్రీనివాస్ లు తమ అనుభవాలు, భవిష్యత్ ప్రణాళికలను గురించి వివరించారు. ఈ సందర్భంగా గతంలో విశ్వవిద్యాలయ అధికారులుగా పనిచేసిన డాక్టర్ జెల్లా సత్యనారాయణ, డి. శివాజీ లని సన్మానించారు. వారి సేవల్ని కొనియాడారు.



వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు, ఉద్యోగులు, విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య



పీహెచ్‌డీలో సీటు పొందిన రామకృష్ణ కు ధ్రువీకరణ పత్రాన్ని అందచేస్తున్న రిజిస్ట్రార్ విద్యా సాగర్, డాక్టర్ కె బి ఈశ్వరి లు

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ కౌన్సిలింగ్

బుద్వేల్, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం): దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విద్యను అభ్యసించే అవకాశం రావడం అదృష్టమని రిజిస్ట్రార్ డాక్టర్ జి యి సీ హెచ్ విద్యాసాగర్ అభిప్రాయపడ్డారు. తాను కూడా బీఎస్సీ , ఎం యస్సీ ఈ విద్యాసంస్థలోనే చదివానన్నారు. 2024 - 25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పీ హెచ్ డీ కౌన్సిలింగ్ ని ఆయన బుదవారం రాజేంద్రనగర్ లోని వాటర్ టెక్నాలజీ సెంటర్ లోని డైమండ్ జూబ్లీ బ్లాక్ లో లాంచనంగా ప్రారంభించారు. నిబంధనలకి అనుగుణంగా పూర్తి పారదర్శకంగా కౌన్సిలింగ్ ప్రక్రియ నిర్వహిస్తామని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రణాళిక బద్ధంగా సెమిస్టర్లు పూర్తి చేస్తామని డీన్, పీజీ స్టడీస్ డాక్టర్ కె బి ఈశ్వరి తెలిపారు. ప్రతిభ ఆధారంగా, నిబంధనల ప్రకారం కౌన్సిలింగ్ ప్రక్రియని నిర్వహిస్తామని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎం మల్లారెడ్డి తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక విద్యా సంస్థలో పీ హెచ్ డీ ప్రవేశాలకి హాజరైన అభ్యర్థులందరికీ ఆయన స్వాగతం తెలిపారు. తొలుత అగ్రానమిలో సీట్లు పొందిన విజయశ్రీ కి రిజిస్ట్రార్ కేటాయింపు పత్రాన్ని అందజేశారు. తర్వాత అగ్రానమిలో సీట్లు పొందిన కావ్య, రామకృష్ణ లకి, సాయిల్ సైన్స్ లో సీటు పొందిన ముబీనుద్దీన్ లకి కేటాయింపు పత్రాలు అందజేశారు.

## పనిచేస్తున్న చోట కార్యాలయ భవనంపై నుంచి పడి అటెండర్ దుర్మరణం



జయరాం

బుద్వేల్ ఫిబ్రవరి5 (ప్రభాత ఉదయం) పనిచేస్తున్న చోట మూడంతస్థుల కార్యాలయం పై నుం చి పడి ఓ ఉ ద్యోగి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన రాజేంద్రనగర్ లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థకు చెందిన ఎక్స్ టెన్షన్ ట్రైనిగ్ ఇనిస్టిట్యూట్ (ఈటీసీ) కార్యాలయం లో బుధవారం జరిగింది. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. రాజేంద్రనగర్ కు చెందిన సోము, సుగుణమ్మ ల కుమారుడు జయరాం (47) తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ లో అటెండర్ గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవలనే ఆయన ఈటీసీ కి బదిలీ అయ్యాడు. ఆయనకు భార్య స్వప్న, కూతుళ్లు సౌమ్య, రుద్విక లు ఉన్నారు. బుధవారం డ్యూటీ కి వెళ్లిన జయరాం తాను పనిచేస్తున్న కార్యాలయంలో ఉదయం 11:50 నిమిషాలకు మూడవ అంతస్తు నుంచి క్రింద పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైనాడు. ఆ సమయంలో పక్కన డ్యూటీలో ఉన్న బీటీ రవి చూసి ఈటీసీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి కి సమాచారం అందించాడు. ఆయన వెంటనే 108 కి కాల్ చేసి సమాచారం ఇవ్వగా గాయపడ్డ జయరాం ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే జయరాం మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు. జయరాం మూడవ అంతస్తుకు ఎందుకు వెళ్లాడు. ఎలా క్రింద పడ్డాడనే వివరాలు తెలియాల్సి ఉంది. రాజేంద్రనగర్ ఇన్స్ పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో ఎస్ఐ కిషోర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కొప్పుల అమరేశ్వర్ గౌడ్

## అక్రమాలకు పాల్పడుతున్న అమరేశ్ గౌడ్ అరెస్ట్

బుద్వేల్, ఫిబ్రవరిత్ (ప్రభాత ఉదయం): దొంగ సంతకాలు, ఫోర్జరీ, చీటింగ్ చేసి తప్పుడు రిజిస్టేషన్ చేసిన కేసులో ఏ1 గా ఉన్న టీఎన్జీవోస్ కాలనీ నివాసి కొప్పుల అమరేశ్వర్ గౌడ్ (51) ను మైలార్దేవుపల్లి పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసులో జనవరి 28న మరో నిందితుడు శ్రీనివాస్ ను అరెస్ట్ చేసి రిమాండ్ చేశారు. వివరాలు ఈ విదంగా ఉ న్నాయి. నగరానికి చెందిన కుక్కమల్ల ప్రకాశం అనే వ్యక్తి కి 1974లో కాటేదాన్ లో గల టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ లో ప్లాట్ నెంబర్ 517 లో 300 గజాల స్థలం అలాట్ అయ్యిం ది. 1999లో కుక్కమల్ల ప్రకాశం మరణించారు. ఆ ఫ్లాట్ ఖాళీగా ఉండటం తో కన్నేసిన కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీకి చెందిన కొప్పుల అమరేశ్వర్ గౌడ్ ప్రకాశం మరణించిన 12 సం వత్సరాలకు. అంటే 2011లో తనకు తెలిసిన సుభాష్, శ్రీనివాస్, సయ్యద్ రశీద్, నర్సింహ్మారెడ్డిలతో కుమ్మకై ఒక గుర్తు తెలియని వ్యక్తి ఫోటో ను పెట్టి అతనే కుక్కమల ప్రకాశం అని నమ్మించి అమరేశ్వర్ గౌడ్ ఫోర్టరీ సంతకం చేసి సుబాష్ అనే వ్యక్తి పేరు మీద జీపీఏ చేశాడు. ఆ తర్వాత అట్టి ఫ్లాట్ ను వీరందరు కలసి అశోక్ అగర్వాల్ అనే వ్యక్తికి విక్రయించారు. ఆశోక్ అగర్వాల్, సంజు దేవీ లు ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నారు. ప్రకాశం కుటుంబ సభ్యులు అట్టి స్థలాన్ని మైలార్దేవుపల్లి కి చెందిన పవన్ గౌడ్ అనే వ్యక్తికి ఇటీవల కాలం లో జీపీఏ రిజిస్ట్రేషన్ చేసారు. పవన్ గౌడ్ స్థలం వద్దకు రాగా అప్పటికే ఆ స్థలంలో ఇల్లు నిర్మించుకుని అశోక్ అగర్వాల్, సంజుదేవీ లు నివాసం ఉంటున్నట్లు తెలిసుకున్నాడు. దీంతో పవన్ గౌడ్ మైలార్దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న ఇన్స్పెక్టర్ నరేందర్ ప్రకాశం కు చెందిన స్థలాన్ని కొప్పుల అమరేశ్వర్ గౌడ్ మరి కొంతమందితో కలసి కబ్జా చేసి ఇతరులకు విక్రయించినట్లు విచారణలో తెలుసుకున్నారు. ఈ కేసులో 2025 జనవరి 28న ఏ2 గా ఉన్న శ్రీనివాస్ అనే వ్యక్తిని ఆరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన పోలీసులు బుధవారం ఏ1 గా ఉన్న కొప్పుల అమరేశ్వర్ గౌడ్ ను ఆరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. కోర్టు అమరేశ్వర్ గౌడ్ కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఇన్స్పెక్టర్ నరేందర్ తెలిపారు.

### ఇన్స్‌పెక్టర్ నరేందర్ కు అభినందనల వెల్లువ :

కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీలో కబ్జాలు ఎక్కువే. స్థానికంగా పలుకుబడి ఉన్నవారు ఇతరుల స్థలాలను కబ్జా చేసి సొమ్ము చేసుకుంటున్నారు. అయితే ప్రకాశం అనే వ్యక్తికి చెందిన స్థలాన్ని కొప్పుల అమరేశ్వర్ గౌడ్ కబ్జా చేసి ఇతరులకు విక్రయించగా పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడంతో స్థానికులు వర్షం వ్యక్తం చేశారు. ఇన్స్ పెక్టర్ నరేందర్ ను అభినందనలతో ముంచెత్తారు. మిగతా విషయాల్లో కూడా ఇదే పద్ధతిని కొనసాగించాలని కోరారు.



కేక్ కట్ చేస్తున్న అప్పారెడ్డి గూడెం మనస్విన్



తల్లి తండ్రులు అప్పారెడ్డి గూడెం మహేందర్, కలాశ్రీ లతో మనస్విన్ (చెర్రీ), శ్రేష్టా బ్లెస్సీ లు



చెల్లెలుతో కలసి కేక్ కట్ చేస్తున్న మనస్విన్

## ఘనంగా మనస్విన్ జన్మదిన వేడుకలు

**బుద్వేల్, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం): రాజేంద్ర నగర్ కు చెందిన అప్పారెడ్డిగూడెం మహేందర్ - కళాశ్రీల కుమారుడు మనస్విన్ (చెర్రీ) జన్మదిన వేడుకలు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పెదనాన్న ఆప్పారెడ్డి గూడెం భీమయ్య, బాబాయ్ ఆప్పారెడ్డి గూడెం రాజు కుటుంబ సభ్యులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించారు.**

## త్రాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం)రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామాలలో తాగునీటి ఎద్దడి నివారణకు జిల్లా మిషన్ భగీరథ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో బాగంగా మిషన్ భగీరథ ఇంట్రా ఇఇ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గద్వాల మండలం గోనుపాడు గ్రామంలో అధికారులు పర్యటించి మిషన్ భగీరథ నీటి సరఫరా వ్యవస్థను, చేతి పంపులను, తాగునీటి మోటార్లను పరిశీలించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో తాగునీటి రికార్డులను ఇఇ శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. ప్రతి పది రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రపరచాలని, పైప్ లైన్ లీకేజి లేకుండా చూడాలని, తగినంత మోతాదులో క్లోరినేషన్ కలిపి త్రాగు నీరు సరఫరా చేయాలని ఇ ఇ శ్రీధర్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో వచ్చే ఫిర్యాదులకు టోల్ ఫ్రీనంబర్ 1800 5994007 కు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ నూర్, గామపంచాయతీ కార్యదర్శి, తదితరులు పాల్గొన్నారు.



హైదర్ గూడ చౌరస్తాలో ప్రదాన మంత్రి నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు





రాజేంద్రనగర్ లో ప్రధాని నరేంద్ర మోడీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

## దేశ ప్రగతికి ఉపయోగపడే బడ్జెట్

బుద్వేల్, ఫిబ్రవరి5(ప్రభాత ఉదయం) : దేశంలో ఉన్న పేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేసే విదంగా బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ కి అత్తాపూర్ డివిజన్ బీజేపీ నాయకులు బుధవారం ధన్యవాదాలు తెలియజేసారు. డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సులిగె వెం కటేశ్ ఆధ్వర్యంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి. మల్లేశ్ యాదవ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాడెం సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి రాచూరి రాజశేఖర్, పార్టీ నాయకులు కె.కిరణ్ చారి, ఎస్.విజయ్ కుమార్. మోండ్ర నర్సింహ్మా. పుస్తకాల అశోక్, జయానంద్ రెడ్డి, అనురాధ, జగన్, గౌరీష్, తదితరులు పాల్గొన్నారు.

### రాజేంద్రనగర్ డివిజన్ ఆధ్వర్యంలో..

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆశీస్సులతో తెలంగాణ సుస్థిర అభివృద్ధి సాధ్యమని యువమోర్చా రాష్ట్ర నాయకులు బొక్క బాల్రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జి.బాబురావు అధ్యక్షతన బుధవారం రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రగతి, సమగ్ర, సుస్థిర అభివృద్ధికి నిదర్శనంగా ఈ ఏడాది కేంద్ర బడ్జెట్ లో కేటాయింపులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రాయోజిత పథకాల అమలుకు రూ.14వేల కోట్లు ఇవ్వడం ద్వారా ప్రతి ఇంటికి లబ్ది చేకూరేలా బడ్జెట్ ఉందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా 2.5 లక్షల ఇళ్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ, జహిరాబాద్ కు ఇండసీ యల్ స్మార్ట్ సిటీ, రోడ్ల అభివృద్ధికి నిధులు ఇచ్చారన్నారు. సాక్షాత్తు మంత్రులే తెలంగాణ రాష్ట్రం లో కమీషన్లు తీసుకుంటున్నారని సొంత పార్టీ ఎమ్మెల్యేలు మీటింగ్ లు పెట్టుకోవడంతో ఏం చేయాలో తెలియని కాంగ్రెస్ నాయకులు బడ్జెట్ పై ఆవాకులు. చెడాకులు మాట్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ యోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని సదానంద్. ఎస్సీ మోర్చా రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి. రాజేంద్రనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు బండారి బాలక్రిష్ణ, పసుపుల సందీప్ ముదిరాజ్, శ్రీనివాస్ రెడ్డి, పద్మ, స్వప్న, సరిత, మల్లేశ్, వంశీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా

### కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హనుమంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 5 (ప్రభాత ఉదయం) కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ 1 వార్డ్ ఎల్ జి విస్టాస్ లేఔట్ మరియు ప్రిథ్వి ,అద్విక్ అపార్ట్మెంట్స్ కాలనీ లో మౌలిక సదుపాలయాలు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజుల కిందిట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినపించుకోగా బుధవారం హన్మంత్ రెడ్డి కాలనీ కి వెళ్లి రోడ్లు పరిసలించి సదరు కమీషనర్ తో మాట్లాడి వీలైనంత త్వరలో సీసీ రోడ్, డ్రైనేజీ స్పెషల్ ఫండ్స్ ద్వారా వెలయాలి తెలిపారు. ఈ కార్యక్రమం లో కొంపల్లి మున్సిపాలిటీ అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, మాజీ సర్పంచ్ జెమ్మి దేవేందర్, మాజీ.ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ.కౌన్సిలర్ శివ కుమార్ గౌడ్, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, జయభేరి గోపాల్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, అశోక్ రెడ్డి, కాలనీ వాసులు శ్రీనివాస్ రెడ్డి, భాగ్య రెడ్డి, నరేందర్ రెడ్డి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు కిస్మత్‌పూర్, శంషాబాద్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం



బండ్లగూడ/శంషాబాద్, ఫిబ్రవరి 5(ప్రభాత ఉదయం) కిస్మత్ పూర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో వివిధ మరమ్మత్తుల నిమిత్తం గురువారం విద్యుత్ సరఫర నిల్పి వేస్తున్నట్లు సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ ఏ మల్లేష్ రాజ్ తెలిపారు. డిఫెన్స్ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఆర్ వి నిర్మాణ్, ట్రంపు విల్లా, సాయిబాబా కాలనీ, డిఫెన్స్ కాలనీ, రామ్ కి విల్లా, ఖాదర్ ఎన్నారై ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయాన్ని సహకరించాలని ఆయన కోరారు.

### శంషాబాద్ లో...

శంషాబాద్ విద్యుత్ సెక్షన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుండి మూడు గంటల వరకు సీఎస్కే కాలనీ, రాఘవేంద్ర కాలనీ, శ్రీ బాలాజీ టౌన్షిప్, రాల్లగూడ, ప్రకాష్ నగర్, యాదవ కాలనీ, ఫోర్డ్ గ్రాండ్ కాలనీ లలో గురువారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లో అంతలా ఏముంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ షేక్ భాష తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

